


# గృహ ప్రవేశం

ఐ.ఎమ్.ఎ. సావనీర్ - 1995

---

కృషి, పట్టుదల, సమర్ధత వుండాలేగాని మనిషి సాధించలేనిదేమీ వుండదు. కానీ దీనికి తోడు అక్షరదీపం కూడా వెలగాలి.

- జయప్రద

---

వాళ్ళ ముగ్గురిదీ అద్భుతమైన స్నేహం. అందులో ఇద్దరు ఏక గర్భ జనితులు. కథానాయకుడి పేరు శివయ్య. వాళ్ళ వంశపారంపర్య విద్య రిక్షాతొక్కడం. అయితే వంశపారంపర్యంగా రాని అలవాటు తాగుడు.

అందుకే ముగ్గురూ తలా ఒక రిక్షాకి సొంతదారులయ్యారు. శివయ్యన్నా, తమ్ముడు మల్లీసన్నా స్నేహితుడు కనకయ్యకు కాస్త చిరాకు... కాస్త వేళాకోళం. దాని క్కారణం లేకపోలేదు.

కనకయ్య భూమిమీద నడిస్తే అన్నదమ్ములు ఆకాశంలో విహరిస్తుంటారు. వాళ్ళిద్దరూ కలిసి నెలకో పన్నెండొందలు సంపాయించే మాట వాస్తవమేగానీ,

'చేతులు సవ్యంగా వుంటేనే మన సంపాదన' అంటాడు వాడు. అన్నట్టే వాడికీ మధ్య గుండె జబ్బొచ్చి పడి, రిక్షా అమ్మాడు. అమ్మేసి వాళ్ళూరెళ్ళిపోయాడు.

వాడికీ పాడు జబ్బు రాకముందు.... వాళ్ళిద్దరూ కలిసి చేసిన ప్రతిపాదనకు వాడి మతిపోయింది.

"అరే కనకా! సినిమా పెట్టి కొనుక్కుందాంరా! అదేరా టెలివిషం" తమ జీవితాల్లో.... తీరాల్సిన అవసరాలు కోటుండగా ఏమి కోరికిది? చీవాట్లు ఓవర్ డోస్ పడ్డాక అన్నదమ్ముల నోళ్ళు మూతలు పడ్డాయి.

అది అలా వుండగా.... ఆ రోజు వాళ్ళ సంగం ఎదురుగా తాలూకాఫీసులో పనిచేసే గుర్నాథం తన మూడు గదుల కొత్త యింట్లో గృహ ప్రవేశం చేశాడు.

శివయ్యకు ఆ క్షణంలోనే అలాంటి ఇల్లు కట్టేసుకుని ఘనంగా గృహ ప్రవేవం చేయాలనే కోరిక గుండెల్లో గూడుకట్టుక్కూర్చుంది.

రిక్షా తుడుచుకుంటున్న తమ్ముడి దగ్గరకొచ్చి ప్రక్కనే... గొంతు కూచున్నాడు.

"ఒరే! మల్లేసా...! లేరా..."

మల్లేసు పనాపి తలెత్తి చూసాడు. శివయ్యకు కాస్త బెరుగ్గానే వుంది చెప్పాలంటే.... తమ్ముడి క్కూడా కోరికలున్నాయి కానీ, మరీ ఇంత పెద్ద కోరిక... ఇది విని వీడు ఎగతాళి చేస్తే.... తటపటాయిస్తూ అన్నాడు.

"నువ్వు పంతులుగారిల్లు సూసావట్రా? ఎట్టాగుందిరా?"

"సాలా బాగుంది."

"అట్టాటిల్లు మనవూ కట్టుకుంటే.... ఎట్టా వుంటదిరా...?"

"అట్టాటిల్లా? పైన తాటాకులు గడ్డి లేకుండానా?" తెల్లబోయాడు వాడు.

శివయ్యకు చిరాకేసింది. తనింత పెద్దిల్లు గురించి చెప్తొంటే ఎదవ తాటాకులు, గడ్డి అంటాడా? కసురుకుంటూ లేచి నిల్చున్నాడు.

మల్లేసుకు గుండెల్లో మెల్ల మెల్లగా సంతోషం చోటుచేసుకుని, హఠాత్తుగా పరవళ్ళు తొక్కుతూ, ప్రవహించసాగింది. చటుక్కున లేచి నిల్చుని, ఆ మట్టి చేతుల్తోటే, అన్న భుజాలు పట్టి వూపేశాడు.

"అట్టాగేరా అట్టాగే..." శివయ్య తమ్ముడి పక్కనజేరి, తను కట్టబోయే ఇల్లు... అందులోని ఏర్పాట్లు గురించి ఏకధాటిగా ప్రసంగిస్తున్నాడు.

"మరో నాలుగయిదేళ్ళల్లో కూడబెట్టలేవంటా..." శివయ్య మనసులో ఆశాభావం.

వాడు తన మనసులో లెక్కలు కట్టేసాడు. ఇల్లు కట్టేసాడు. గృహ ప్రవేశం కూడా చేసేసాడు.

"సరే అన్నా! అలాగే సేద్దాం. కానీ మనం దుర్ ఖర్చులేవీ సేయకూడదు."

"అట్టైరా! గుడ్డలు కూడా కొనద్దు. అళ్ళూ, ఈళ్ళూ ఇచ్చినవి కట్టుకోవాల."

"ఆ! కూర కర్చు కూడా వొద్దు. పచ్చడేసుకుని తింటే అరిగిపోదా ఏం?"

ఇద్దరూ రిక్షా తుడుచుకుంటూ కలల్లో తేలిపోతున్నారు. అలా తేలిపోతుండగా, సడన్‌గా మల్లేసు ముఖం మలినమైపోయింది.

"అరే అన్నా! కనకయ్య ఒప్పుకుంటాడంటావా?" శివయ్య కలల్లో తేలడం క్షణం సేపు ఆపి, అన్నాడు.

"అడితో గొడవే! ఒప్పిద్దాంలే."

* * * * *

ఇది నాలుగేళ్ళ నాటి మాట. ఇప్పుడు శివయ్య.... మల్లీశం ఓ మూడు గదుల ఇంటికి ఓనర్లు. ఆనాడు కనకయ్య కూడా, స్నేహితుల ప్రతిపాదనకు తోసిపుచ్చలేదు. పైగా, వాళ్ళను ఉత్సాహపరిచాడు. ఇల్లంటే అవసరం... ఆస్థి.

ఇల్లంటే ఒక్క ఇల్లే కాదు. ఆ ఇంటి ముందు ఓ పెద్ద తెల్లబోర్డు. ఆ బోర్డుమీద పెద్ద నల్లక్షరాలు. ఆ నల్లక్షరాల వెనక ఓ పెద్ద కథ. రోజంతా శివయ్య రిక్షా తొక్కుతున్నాడన్న మాటేగాని, అతని దృష్టంతా ఆ పక్కా, ఈ పక్కా, కదిలి వెనక్కు వెళ్ళిపోయే మేడల వాకిట వేలాడగట్టిన నేమ్ ప్లేట్స్ మీదే వుంది. దిక్కులు చూస్తూ వెళ్తున్న శివయ్య రిక్షా ముందు చక్రం గోతిలోపడి... విరిగిపోయింది. సానుభూతిగా శివయ్య కాలు కూడా విరిగింది.

ఆ తర్వాత సంగతి పాఠకులు వూహించొచ్చు. విరిగిన కాలు ఎముక అతుక్కుంది గానీ, వాడి గుండెల్లో కోరిక మాత్రం సమాధికాలేదు.

గృహ ప్రవేశానికి ఇంకా పదిరోజులుంది. మల్లీసు ఇంటికి సున్నం వేస్తున్నాడు. శివయ్య పైగుడ్డతో బూజులు దులిపి.... ఏకైక వెల్డింగ్ కిటికీని తుడుస్తున్నాడు.

"మన ఇంటికి ఓ పేరెట్టుకుంటె ఎట్టా వుంటదిరా?"

"పేరా?" తెల్లబోయి చూసాడు మల్లేసు.

"ఓ! మన రిక్షాల ఎనకుంటదే... అట్టాటిదా?" మరలా అన్నాడు. "అట్టాటిది

కాదులే..." కోపమొచ్చింది శివయ్యకు. ఇంత ముచ్చటైన ఇంటికి... ఇంత గొప్పింటికి రిక్షా పేరా?

"అయితే, ఏం పేరెడ్దామంటావు? ఏం పేరబ్బా! దేవుడి పేరెడ్దామా?"

"ఉహూ! ఇ స్టైలుగా, ఇంగిలీషు పేరేదైనా పెట్టుకుందాం రా."

ఇంగిలీషు పేరనగానే మల్లీసు కూడా ముచ్చటేసింది.

"ఓ పని సేద్దాంరా! బోరుడులు రాసేవాడిని... రిక్షాలో ఎక్కించుకుని, అట్టా పోయి, చూసొస్తా... నాకు నచ్చిన పేరు ఆడికి చూపించి, రాయించి యిమ్మంటా... ఏమంటావు?"

"అద్గదే! అట్టాసెయ్."

* * * * *

ఊరికి దూరాన చీప్‌గా కొనుక్కున్న స్థలంలో, మెలుకువలు తెలీక, పాతిక వేలతో కట్టాల్సిన ఇంటిని ముప్పయి వేలతో కట్టినా, చాలా సంతోషంగా కూర్చొనున్నారు శివయ్య, మల్లేసు. ఆ యిల్లు, ఆ నేమ్ బోర్డు 'నాది' అనే భావం వాళ్ళిద్దర్ని ఆనంద సాగరంలో ముంచేస్తోంది. కానీ, ఆ ఆనందం కాస్తా ఆశ్చర్యంలోకి మారడానికి రెండు రోజులు టైము తీసుకుంది.

గృహ ప్రవేశం జరిగిన మూడోరోజున, రిక్షాలు రెండూ వాకిట్లో వుంచుకుని, బయలు దేరడానికి సిద్ధంగా వున్నారు అన్నదమ్ములు.

"ఓ అన్నా! ఈ బిందె తీసుకుని, పాతిక రూపాయలిస్తావా. మా ఓడికి చలిజ్వరం వచ్చినాది. డాక్టరికి చూపించాల."

మల్లేసు అడిగిన ఆమెతో ఏదో చెప్పబోయాడు. శివయ్య ఆపేవాడు. నిగనిగ మెరుస్తున్న స్టీలు బిందె. ఎంతలేదన్నా వంద రూపాయలుంటది. ఏదో అవసరం కొద్దీ అడుగుతోంది... పాపం.

మరో మాట లేకుండా, లోపలకెళ్ళి, గృహ ప్రవేశానికొచ్చిన చదివింపుల చిల్లర నోట్లనుండి, పాతిక రూపాయలు తీసి, చేతిలో పెట్టాడు.

బిందయితే కింద పెట్టిందిగానీ, ఆమె కదల్లేదు. "బిందె తీసుకున్నట్టు కాగితం ముక్క రాసీయన్నా."

మల్లీసు ఏదో మాట్లాడబోయాడు.

శివయ్య జేబులోనుండి, ఖాతా బుక్‌లో నుండి చిన్న కాగితం ముక్కతీసి, తనకు తెలిసిన తెలుగుభాషా పరిజ్ఞానంతో బిందె తీసుకుని డబ్బిచ్చినట్టు వ్రాసిచ్చాడు.

పాపం వాళ్ళాయన కోప్పడ్తాడు కావాల! 'బిందేం చేసావ'ని.... అందుకే వ్రాయించుకుపోయింది అని సానుభూతి కూడా చూపించాడు.

ఆ మర్నాడు ఆరుగంటల వేళ మల్లేసు రిక్షా కట్టేసి, తొందరగా ఇంటి కొచ్చేసాడు. వాడికి కొత్త ఇంట్లో, కాలుమీద కాలేసుకుని, చాపమీద పడుకోవాలనుంది.

ఇంకా మంచాలు కొనుక్కోవడానికి డబ్బులు కూడ లేదు. అంత ఇల్లు కట్టుకొన్నా... రిక్షా తొక్కడం వాళ్ళిద్దరూ నామోషీగా అనుకోవడం లేదు. అంతకంటే ఆధారం లేదు వాళ్ళకి.

ఒకరిద్దరు సలహా కూడా ఇచ్చారు. ముందుగది బాడుక్కివ్వమని... కొంత బాడుగ వస్తదని... ఆ సలహా యిద్దరికీ నచ్చలేదు. ఇల్లు కట్టుకుంది ఎవడో సుఖ పడడానికా? తమ రెక్కాడితే ఆ మాత్రం సంపాదించుకోలేరా?

"ఎవరయ్యా ఇంట్లో?" చటుక్కున లేచి గుమ్మంలో కొచ్చాడు మల్లీసు. "ఈ గొలుసులట్టుకుని పది రూపాయలిస్తా... ఈ రోజే చిరంజీవి సినిమా వొచ్చింది."

'దీని సినిమా పిచ్చి తగలడ.' అనుకుని, ట్రంకు పెట్టెలో అప్పుడే పెట్టిన ఆ రోజు కలెక్షన్ తీసి ఆమె చేతిలో పెట్టాడు. "చీటీ రాసీనా..." అని ఈసారి అతనే అడిగాడు. "ఒద్దొద్దులే... సినిమాకి టైమయినాది..." అని గిరుక్కున వెళ్ళిపోయింది.

చేతిలో గొలుసుల వంక చూసుకున్నాడు మల్లీసు. ఈ మద్దెనే పెద్దమ్మ కూతురు చేయించుకుంటే, అరవయి రూపాయలయినాయి ఎండి గొలుసులు.

ఆ మర్నాడే ఇద్దరన్నదమ్ములు గొలుసులు, బిందె అమ్ముకుని, ఓ నులక మంచం కొనుక్కున్నారు.

మరో రెండు రోజులు గడిచాయి. ఇలాటివి మరో మూడు వస్తువులొచ్చాయి. వాటిని అమ్మి, వైరు కుర్చీ కొనుక్కుని, అందులో కూర్చొని తెగ ఆనందించారు. పది రోజుల్లో వాళ్ళకిలా చిన్నా పెద్దా చాలా వస్తువులొచ్చాయి.

తీరిగ్గా కూర్చుని... కలిసొచ్చిన ఆ యింటిని పొగుడుతున్నాడు శివయ్య. "అన్నా ఇదంతా మన ఇల్లు మహత్యం..." అనగానే "వాస్తు పెకారం కట్టాం కదా!" అన్నాడు శివయ్య.

"అదృష్ట పుయిల్లోరే!... ఒక్కో ఇల్లు తీరే అంత" అని మరీ మరీ వంతపాడాడు అన్న. అలా వాళ్ళు ఇంటి ఔన్నత్యాన్ని పొగుడుకుంటుంటే.... ఆ ఇంటి ముందు ఓ మోటార్ సైకిల్ ఆగింది. ఇద్దరు మనుషులు లోపలికొచ్చారు.

"ఎవరయ్యా ఇంట్లో? ఇల్లు మీదేనా?" ఇద్దరూ దర్పంగా కోరస్ పాడారు.

"లెక్క పుస్తకాలు చూపించండి."

జేబులో వున్న రిక్షా బాడుగల ఖాతా చిత్తు పుస్తకంతీసి చూపించాడు శివయ్య. మళ్లీసు లోపలికి పరుగెట్టాడు గూట్లో పెట్టిన పుస్తకం తేను.

విసుగ్గా చూశాడు వచ్చిన అతను. అతను దర్జాగా వున్నాడు ఇంకొకతను. అతని ముందు ఒంగొంగి నిల్చోనున్నాడు.

"అకౌంట్ బుక్సయ్యా!... ఖాతా పుస్తకాలు..."

"ఇయ్యే పుస్తకాలండీ!... ఇంకేమీ లేవు మాకాడ."

కోపంగా లేచి బయటకొచ్చి, బెట్టుగా నిల్చున్నాడు ప్యాంటతను.

"వ్యాపారం చేసేప్పుడు పుస్తకాలు కొనుక్కోడం తెలీకపోతే ఎట్టయ్యా? కరెక్టుగా రాసుకోకపోయినా, ఏదో దొంగ లెక్కలైనా రాయాలి కదా." వంగిపోయున్న మనిషి చనువుగా కేకవేశాడు.

"మాకేం కర్మయ్యా? ఏదైనా కరకట్టుగానే వ్రాసుకుంటాం. ఏరా శివయ్యా..."

"అంతే గదయితే..."

అతనికే విసుగొచ్చినట్టుంది

"ఆ పుస్తకాలేనయ్యా అడిగేది?" మరలా జోబిలో నుండి చిన్న చిత్తు కాగితాల బుక్ తీశాడు శివయ్య.

"సరే సర్లే! అయ్యగారికి వంద రూపాయలిచ్చేయండి. మీ సంగతి తర్వాత కమర్షియల్ టాక్సోళ్ళు చూసుకుంటారు." వాళ్ళ పేదరికాన్ని అర్థం చేసుకున్న బంట్రోతు అన్నాడు.

"మీరెవరు దొరా!"

"మేం ఇన్‌కంటాక్స్ వాళ్ళం. డోర్ టు డోర్ చెకింగ్‌కొచ్చాం."

ఒక్క అక్షరం ముక్క కూడా వాళ్ళకి అర్థం కాలేదు.

"ఆ రిక్షాలు కూడా ఆ బాపతేనా?"

వెర్రిగా చూశారు వాళ్ళు.

"అయ్యగారు బయట వెయిట్ చేస్తున్నారు. డబ్బిస్తారా? కేస్ రాసుకోమంటారా?"

కేస్ అనగానే హడలిపోయి, తాము కొనుక్కున్న మంచానికెదురుగా బిగించు కోను... కొనుక్కోవాలనుకున్న నిలువుటద్దం తాలూకు వంద రూపాయలు తెచ్చి, ఆయన దోసిట్లో పోశాడు. అతను బయట కెళ్ళిపోయాడు. అన్నదమ్ములిద్దరూ కోలుకునేసరికి మోటార్‌సైకిల్ వెళ్ళిపోయింది. ఇద్దరిలో ఏదో అనుమానం, ఏదో వెలుగు... ఇద్దరూ చప్పున బయటకు పరుగెత్తారు.

తన దగ్గర డబ్బు తీసుకున్నతను, తన చేతిలో మిగిలిపోయిన, నాలుగయిదు చిన్న కాగితాలను లెక్కబెట్టుకుంటున్నాడు.

"దొరా! దొరా! ఇట్టారా!" అతను దగ్గరగా వచ్చాడు.

"మా యింటి ముందు బోర్డులో ఇంగిలీషు అక్షరాలున్నాయి. వాటిని చూసి, తెలుగులో అర్థం చెప్పండి."

ఈసారి అతను తెల్లబోయాడు.

తలెత్తి ఆ బోర్డువైపు మరోసారి చూశాడు.

వాళ్ళ ముఖాలను పరిశీలించి చూస్తూ చెప్పాడు.

'పాన్ బ్రోకర్స్.... అంటే కుదువ వ్యాపారం."

ఇద్దరూ షాక్‌లో కెళ్ళిపోయారు. ఆ తర్వాత కొన్ని రోజులపాటు, కుదువ పెట్టిన వస్తువులు అమ్ముకున్నందుకు గాను, ఎముకలు చితగ్గొట్టించుకున్న వైనం ఎవ్వరికీ చెప్పుకోలేదు. కనకయ్యకు తప్ప.